ఈనాడు
తమిళనాడు



విన్యాసాల వేడుక.. చూద్దాం రండి

◆ కనువిందు చేయనున్న వాయుసేన విమానాలు

◆ చెన్నై బీచ్‌లో ఆదివారం 11 గంటల నుంచి

చెన్నై బీచ్ రోడ్డులో నిర్వహించే వాయుసేన విన్యాసాలు రికార్డు సృష్టించనున్నాయి. అత్యధిక సంఖ్యలో వీక్షకులకు ఇది వేదిక కానున్నట్లు డిఫెన్స్ అధికారులు ప్రకటించారు. ప్రధానంగా చెన్నై బీచ్‌లో, నగరవ్యాప్తంగా తిలకించేందుకు వీలుగా విమానాలు విన్యాసాలు ఉండబోతున్నాయి. ఏ ఏ ఎయిర్‌క్రాఫ్ట్‌లు పాల్గొననున్నాయి, వాటి విన్యాసాలు ఆసక్తి కలిగిస్తున్నాయి.

ఈనాడు-చెన్నై

కిందకు దూకి..



ఆగ్రా ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లోని పారాట్రూపర్స్ శిక్షణ పాఠశాలకు చెందిన 'ఆకాశ గంగా' బృందం పారాచూట్లతో అద్భుత విన్యాసాలు చేయనుంది. విమానం నుంచి కిందికి దూకి గంటకు 200 కి.మీ. వేగంతో వస్తూ.. ముువ్వన్నెల పారాచూట్‌లతో విన్యాసాలు చూస్తూ భూమికి చేరనున్నారు.



రింగులు తిరుగుతూ..

వేగంతో, విమానాలతో ఆడుకోవడమె లాగో చూడాలంటే బీదర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌కు చెందిన 'సూర్య కిరణ్ ఎయిరోబాటిక్ టీమ్(ఎస్‌కేఏటీ)' విన్యాసాలు తిలకించాల్సిందే. హాక్ ఎంకే 132 జెట్ విమానాలతో వారు చేసే విన్యాసాలు గగుర్పాటుకు గురిచేస్తాయి. ఒకరికొకరు రింగులు తిరగడం ప్రత్యేక ఆకర్షణ.

పొగలు వదులుతూ..



త్రిభుజాకారంలో వచ్చి చిత్రవిచిత్ర విన్యాసాలతో ఆకట్టుకోవడంలో 'రఫేల్' విమానాలు దిట్టగా ఉండనున్నాయి. వాటి నుంచి వదిలే పొగలు ఆ విన్యాసాల తీరును గుర్తు చేస్తాయి.

తలకిందులుగా..

చిన్న పక్షిలా ఆకాశంలో తిరుగుతూ అతి వేగంగా దూసుకుపోతూ 'తేజస్' విమానాలు చేసే విన్యాసాలు అబ్బురపరుస్తాయి. తలకిందులుగా ముందు సాగే విన్యాసం ప్రత్యేక ఆకర్షణ.





హెలికాప్టర్లతో..

విమానాలతో విన్యాసాలు చూశాం.. మరి హెలికాప్టర్లతో..? ఇవేమీ తక్కువ కాదన్నట్లు యుద్ధవాతావరణాన్ని తలపించేలా చేసే ఫీట్లు ఆకట్టుకోక మానవు. 'సారంగ్ బృందం' హాల్ ధృవ్ ఎరుపు హెలికాప్టర్లు ఒంటిపై నెమలి గుర్తులు వేసుకుని భీకర పోరునే సృష్టించనున్నాయి.



లక్ష్య ఛేదనలో దీటుగా..

రక్షణశాఖ పరిధిలోని 'హాల్ ప్రచండ్' యుద్ధ హెలికాప్టర్ చూసేందుకు ఎంతో సొగసుగా ఉంటుంది. లక్ష్యాన్ని గురిపెట్టి ఛేదించడంతో దీటైన సాధనంగా దేశానికి ఉపయోగపడుతోంది. ఈ విన్యాసాలు బీచ్‌లో అలరించనున్నాయి.

మరిన్ని..

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో శిక్షణకు వాడే చేతక్ హెలికాప్టర్, హెచ్‌టీటీ 40, కశ్మీర్ బంగ్లాదేశ్ యుద్ధాల్లో కీలకంగా మారిన డకోట డీసీ-3, గ్లాస్ కాక్‌పిట్‌తో ఉండే పిలాటస్ పీసీ-7, తక్కువ దూర ప్రయాణాలకు వాడే సీ-295, పట్రోలింగ్ కోసం వాడే డీవో-228, యుద్ధంలో రకరకాలుగా ఆయుధాల్ని వాడే మిగ్-29, మిరాజ్-2000, దూర ప్రయాణాల పట్రోలింగ్‌కు వాడే పీ8ఐ విమానం, యుద్ధంలో బాంబుల్ని వదిలేందుకు వాడే జాగ్వార్ ఫైటర్ జెట్‌లు ఈ విన్యాసాల్లో పాల్గొంటున్నాయి.

తలపై నుంచి..



మీదికొచ్చేస్తుందా అన్నంత కిందుగా వెళ్తూ అబ్బురపరిచే విహంగం.. హార్వర్డ్ ఎయిర్‌క్రాఫ్ట్. ఒకటో ప్రపంచయుద్ధంలో ఇది బాగా పనిచేసిన మోడల్. శిక్షణ కోసం వాడుతున్నారు.



వీపుపై రాడార్

విమానంపై మిషన్‌గన్‌లా కనిపిస్తున్న ఈ పరికరం ఏంటో తెలుసా.. ఇదో రాడార్. ఆకాశంలో, సముద్రంలో శత్రువుల్ని గుర్తించేందుకు వాడే సాధనం. ఈ విమానం కమాండ్ కంట్రోల్ వ్యవస్థలా రక్షణదళానికి ఉపయోగపడుతోంది. దీనిపేరు.. ఏఈడబ్ల్యూ అండ్ సీ(ఎయిర్‌బార్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ సిస్టం). దీన్ని కూడా ఎయిర్‌షోలో ప్రదర్శిస్తున్నారు.

యుద్ధంలో దూసుకెళ్లే జెట్..



భారతీయ ఎయిర్‌ఫోర్స్‌లో అత్యద్భుత యుద్ధ సాధనం.. సుఖోయ్-30 ఎంకేఐ. పగలూ, రాత్రిళ్లూ శత్రువుల్ని మట్టుపెట్టే ఈ జెట్ విమానాలు.. చెన్నై వినువీధిలో మతాబుల వర్షం కురిపించనున్నాయి. అలా కురిపిస్తూనే విన్యాసాలతో ఆకట్టుకోనున్నాయి.



ఇంధనం నింపుతుంది..

ఆకాశంలోనే ఎయిర్‌ఫోర్స్ విమానాలకు ఇంధనం నింపేందుకు వాడే విమానం.. ఐఎల్-78. ఇందుకు గుర్తుగా తన వెనకల వచ్చే ఎయిర్‌క్రాఫ్ట్‌లకు ఇంధనం ఎక్కించేందుకు వీలుగా రెండు తీగల్ని చూడొచ్చు. దీన్ని కూడా ప్రదర్శిస్తున్నారు.

మద్యపాన నిషేధ అమలుకు తీర్మానం ఆమోదించాలి

తిరుమావళవన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోగా మద్యం దుకాణాలను మూసి వేస్తేనే డీఎంకే మళ్లీ అధికారంలోకి వస్తుందని, అంతకు ముందు జాతీయ స్థాయిలో మద్యపాన నిషేధ అమలుకు అసెంబ్లీలో తీర్మానం ఆమోదించాలని వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ పేర్కొన్నారు. కళ్లకురిచ్చి జిల్లా ఉళుందూర్‌పేటలో వీసీకే అనుబంధ సంస్థ అయిన మహిళా విముక్తి ఉద్యమం తరపున బుధవారం రాత్రి మాదకద్రవ్యాలు, మద్యపాన నిషేధానికి మహానాడును తిరుమావళవన్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొదట ఈ మహానాడును సెప్టెంబరు 17న నిర్వహించాలనుకున్నామని, ఆరోజు పీఎంకే అమరుల దినోత్సవం కావడంతో ప్రజలు గందరగోళానికి గురికాకూడదని ఈ రోజు నిర్వహించినట్లు తెలిపారు. ఏ మతమైనా మద్యానికి దూరంగా ఉండమనే చెబుతోందన్నారు. అరబ్ దేశాల్లో మద్యం దుకాణాలను ఎక్కడా చూడలేమన్నారు. ప్రపంచ ఖ్యాతి గాంచిన రుషులెవరూ మద్యం తాగడాన్ని సమర్థించలేదన్నారు. మతం మారిన అంబేడ్కర్ మద్యం ముట్టుకోకూడదని ప్రతిజ్ఞ చేశారని, అదేవిధంగా తాను దేశవ్యాప్తంగా మద్యపాన నిషేధం అమలుచేయాలని కోరుతున్నట్లు చెప్పారు.



ప్రసంగిస్తున్న తిరుమావళవన్

అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 18 నెలలు సమయం ఉన్నందున రాష్ట్రంలో మద్యం దుకాణాలను ప్రభుత్వం మూసేస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వస్తుందన్నారు. మహానాడులో డీఎంకే, సీపీఐ, సీపీఎం మొదలైన పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

తమిళిసై తప్పుగా అర్థం చేసుకున్నారు

మద్యపాన నిషేధానికి మహానాడు నిర్వహించే తిరుమావళవన్ మద్యపాన నిషేధం కోసం పోరాడిన మహాత్మా గాంధీకి నివాళులర్పించకుండా కామరాజర్‌కు అంజలి ఘటించి వెళ్లారని, తిరుమా గాంధీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా నడుచుకుంటున్నారని భాజపా సీనియర్ నాయకురాలు, మాజీ గవర్నరు తమిళిసై సౌందరరాజన్ విమర్శించారు. ఇందుకు తిరుమావళవన్ బదులిస్తూ.. గాంధీ విగ్రహానికి నివాళులర్పించడానికి వెళ్లిన సమయంలో అక్కడ భద్రతా విధుల్లో ఉన్న పోలీసులు మొదట గవర్నర్ నివాళులర్పించిన తరువాత తాను అంజలి ఘటించాలని చెప్పారని, తాను ఉళుందూర్‌పేట వెళ్లాల్సి ఉన్నందున కామరాజర్ మండపంలో అంజలి ఘటించి వెళ్లినట్లు పేర్కొన్నారు. తాను మద్యం సేవించేవాడినని తమిళిసై తప్పుగా అర్థం చేసుకున్నారని, ఒకవేళ ఆమెకే ఆ అలవాటు ఉందేమోనన్నారు. తాను విదేశాలకు వెళ్లినప్పుడు కూడా ఒక్క చుక్క కూడా మద్యం సేవించలేదని తెలిపారు.



పురసైవాక్కం పూందమల్లి రోడ్డులో వర్షంలో వెళ్తున్న వాహన చోదకులు



14 జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని 14 జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని చెన్నై వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. శుక్రవారం రాష్ట్రంలో అనేక చోట్ల, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం, పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, మైలాడుతురై, కడలూరు, విళుపురం, చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట, అరియలూర్, పెరంబలూర్, కళ్లకురిచ్చి, వేలూర్, తిరువణ్ణామలై, తిరుప్పత్తూర్, తిరుచ్చి తదితర జిల్లాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఒకటి, రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉంది. శనివారం పుదుక్కోట్టై, తంజావూరు, తిరువారూరు, నాగపట్టిణం, కళ్లకురిచ్చి, తిరువణ్ణామలై, అరియలూరు, పెరంబలూరు, తిరుచ్చి, దిండుక్కల్, తేని, నీలగిరి, ఈరోడు, సేలం, కడలూరు, మైలాడుతురై, విళుపురం జిల్లాలు, కోయంబత్తూరు కొండ ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో ఒకటి రెండు చోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. 6న, 7న కూడా పలు జిల్లాల్లో భారీవర్షానికి అవకాశం ఉందని తెలిపింది. చెన్నై, శివారు ప్రాంతాల్లో 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. చెన్నైలో గురువారం సాయంత్రం పలుచోట్ల మోస్తరు వర్షం కురిసింది.

టోల్ ఛార్జీ ఉపసంహరించాలి

కేంద్ర మంత్రికి మారన్ లేఖ

వడపళని, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో టోల్‌ఛార్జీ ఎత్తివేయాలని కేంద్ర రవాణా, హైవేస్ విభాగ మంత్రిత్వ శాఖకు లోక్‌సభ సభ్యుడు దయానిధి మారన్ బుధవారం లేఖ రాశారు. చెన్నై-బెంగళూరు(ఎన్‌హెచ్ 48) మార్గం అధ్వానంగా ఉందన్నారు. పలుచోట్ల గుంతలున్నాయని, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి లేఖలో వివరించారు. ఇటీవల తాను ఆ మార్గంలో పయనించానని, తనకు ఎదురైన సమస్యలను కూడా తెలియజేశారు. ఇదే అంశాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ కూడా ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. చెన్నై, పోర్టులు, కాంచీపురం, వేలూరు, రాణిపేట, హోసూరు, కృష్ణగిరిలోని పరిశ్రమలకు ఎన్‌హెచ్ 48 ప్రధాన మార్గమని పేర్కొన్నారు. సరైన నిర్వహణ లేకపోవడం, శ్రీపెరుంబుదూరు, వాలాజాపేట మధ్య ఆరు వరుసల నిర్మాణంలో జాప్యంతో ప్రజలు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారన్నారు. హైవేలో కనీస వసతుల్లేని ప్రాంతాల్లో టోల్ ఛార్జీలు వసూలు చేయడం సబబు కాదన్నారు.

సెలవుల్లో ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తే చర్యలు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: త్రైమాసిక పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వ, ప్రభుత్వ సాయం పొందే, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇచ్చారు. 7న తిరిగి ప్రారంభించనున్నారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు 10, 12 తరగతుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని పాఠశాల విద్యాశాఖ హెచ్చరించింది. చెన్నై, తాంబరం, మేడవాక్కం, నామక్కల్, రాసిపురం, కోయంబత్తూర్ తదితర జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా తరగతులు నిర్వహిస్తున్నట్లు, తప్పనిసరిగా పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు లేవనెత్తాయి. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేక తరగతుల జాబితాను సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేస్తు తమ ఆవేదన తెలియజేస్తున్నారు. ఫిర్యాదులు వస్తే వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని శాఖ అధికారులు పేర్కొన్నారు.

రాజకీయ నాయకుడిలా గవర్నర్ వైఖరి

మంత్రి రఘుపతి

చెన్నై: గవర్నర్ ఆర్.ఎన్.రవి రాజకీయ నాయకుడి తరహాలో వ్యవహరిస్తున్నారని న్యాయ శాఖ మంత్రి రఘుపతి ఆరోపించారు. డీఎంకే ప్రధాన కార్యాలయమైన తేనాంపేటలోని అన్నా అరివాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గవర్నర్ రాజ్‌భవన్‌ను రాజకీయ భవన్‌గా మార్చారని ఆరోపించారు. కమలాలయానికి పోటీగా రాజ్‌భవన్‌లో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గాంధీ మండపం ప్రాంగణంలో మద్యం సీసాలు కనిపించడం బాధాకరమని గవర్నర్ తెలిపారని, అక్కడ కార్పొరేషన్ యంత్రాంగం తరపున రోజూ శుభ్రతా పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. పలురాష్ట్రాల్లో మద్యం ఉన్న నేపథ్యంలో దానిని తమిళనాడులో మాత్రమే నిషేధించలేమని తెలిపారు. దేశవ్యాప్తంగా మద్య నిషేధ విధానాన్ని కేంద్రమే చేతుల్లోకి తీసుకోవాలన్నారు. అధికార పరిధిని దాటి వ్యవహరిస్తున్న గవర్నర్ ఆర్.ఎన్.రవి పదవి నుంచి తప్పుకోవాలన్నదే తమ వైఖరని పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు అందించాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇవ్వాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఉపాధ్యాయులకు సెప్టెంబరు వేతనం ఇంకా ఇవ్వలేదని సమాచారం అందిందన్నారు. డీఎంకే ప్రభుత్వ పాలనా అసమర్థతే అందుకు కారణమని ఆరోపించారు. కేంద్రం నిధులు విడుదల చేయకపోవటమనే కారణం చూపి దాదాపు 35 వేల మంది ఉపాధ్యాయులకు వేతనం ఇవ్వలేదని తెలిసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధి నుంచి ఇచ్చేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్య నిషేధం సాధ్యం కాకపోతే పదవి నుంచి వైదొలగండి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: మద్య నిషేధం అమలు సాధ్యమవకుంటే పదవి నుంచి వైదొలగాలని పీఎంకే అధ్యక్షుడు రామదాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. దేశవ్యాప్తంగా మద్య నిషేధ చట్టాన్ని కేంద్రం తెస్తేనే సాధ్యమని న్యాయశాఖ మంత్రి రఘుపతి తెలిపారని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు మద్యం ఫ్యాక్టరీ యజమానుల సంఘం ప్రతినిధిలా ఉన్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వం అనుకుంటే మద్య నిషేధం సాధ్యమేనన్నారు.

నిధుల విడుదలపై కేంద్రం వైఖరి సరిగాలేదు: సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: టాస్మాక్ దుకాణాలు పూర్తిగా మూయనున్నట్లు గతంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించినా నేటివరకు అది నెరవేరలేదని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ తెలిపారు. తమిళ సాహితీవేత్త, రాజకీయవేత్త మా.పో.శివజ్ఞానం వర్ధంతి సందర్భంగా త్యాగరాయనగర్‌లోని ఆయన విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. సంపూర్ణ మద్యనిషేధం అమలు చేసే రాష్ట్రాలకు అదనపు నిధులు కేటాయించాలన్న డిమాండ్ సబబేనని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆదాయ వనరుల్లో తమిళనాడు రెండో స్థానంలో ఉందని, విపత్తు కాలాల్లో నిధులను సక్రమంగా మంజూరు చేయకపోవడం, నూతన విద్యావిధానంపై సంతకం చేస్తేనే విద్యాశాఖకు నిధులు మంజూరు చేస్తామని చెప్పడం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. రాష్ట్ర అధికారాలు గురించి మాట్లాడే డీఎంకే ప్రభుత్వం సంపూర్ణ మద్యనిషేధం వ్యవహారంలో కేంద్రం వైపు ఎందుకు వేలెత్తి చూపుతోందని ప్రశ్నించారు. తర్వాతి గాంధీ జయంతికి టాస్మాక్ దుకాణాలు పూర్తిగా మూయనున్నట్లు గతంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారని గుర్తు చేశారు. మంత్రివర్గం పునఃవ్యవస్థీకరణ పూర్తిస్థాయిలో ఆమోదయోగ్యం కాదన్నారు. ఎన్నికలకు మరో ఏడాదిన్నర ఉన్న నేపథ్యంలో షెడ్యూల్డ్ జాబితాకు చెందినవారికి మంత్రివర్గంలో చోటు కల్పించారని విమర్శించారు. ఉపముఖ్యమంత్రి అయ్యేందుకు కరుణానిధి మనమడు, స్టాలిన్ కుమారుడు అనే అర్హత మాత్రమే ఉదయనిధికి ఉందని, ప్రపంచంలో ఇదే దురదృష్టకరమైన సనాతనం అని ధ్వజమెత్తారు. తన పార్టీ నుంచి నిర్వాహకులు వైదొలగుతున్న విషయంపై స్పందిస్తూ.. అసంతృప్తిపరులు వేరొక పార్టీలో చేరవచ్చని, అది దేశానికి, ప్రజలకు సమస్య కాదని తెలిపారు. బలోపేతమవుతున్న పార్టీలో కొన్ని సమస్యలు ఉంటాయని, వాటిని పెద్దవి చేయకూడదని కోరారు.



మా.పా.శి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీమాన్

పెరుగుతున్న డెంగీ, స్వైన్‌ఫ్లూ బాధితులు

ఆర్కేనగర్: రాష్ట్రంలో డెంగీ, స్వైన్‌ఫ్లూ జ్వర బాధితులు పెరుగుతున్నారు. నిత్యం 5వేల మందికిపైగా ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశాఖ అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరాలు, జలుబు, గొంతునొప్పి తదితర లక్షణాలతో వచ్చేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. వాతావరణ మార్పుల కారణంగా వేలాదిమంది జ్వరం, జలుబు వంటివాటితో బాధపడుతున్నారని చెప్పారు. తేలికపాటి లక్షణాలు ఉండేవారికి యాంటివైరల్ మందులు, వైద్య పరీక్షలు అవసరం లేదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించి వెళ్లాలని తెలిపారు.

నేడు పందిరి గుంజ నాటనున్న విజయ్

చెన్నై, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం తొలి రాష్ట్ర మహానాడు విళుపురం జిల్లాలోని విక్రవాండి వద్ద 27న జరగనున్న విషయం తెలిసిందే. పందిరి గుంజ నాటే కార్యక్రమం శుక్రవారం జరగనుంది. ఇందులో పార్టీ అధ్యక్షుడు, నటుడు విజయ్ పాల్గొననున్నారు.

డ్రగ్స్ చలామణి అడ్డుకోండి: ఈపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: డ్రగ్స్ చలామణిని అడ్డుకోకుండా వేడుక చూస్తున్న డీఎంకే ప్రభుత్వ తీరు ఖండించదగిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి తెలిపారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. ప్రభుత్వ నిర్లక్ష్యంతో చెన్నై హౌసింగ్ బోర్డు ప్రాంతాల్లో గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం అధికమైనట్లు తెలిసిందన్నారు. పోలీసుశాఖలో నిజాయతీపరులైన అధికారులు దృష్టి సారిస్తే డ్రగ్స్ నుంచి యువత, విద్యార్థులను కాపాడగలమని విన్నవించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలు ఏం చేస్తున్నారో పర్యవేక్షించాలని సూచించారు.

రజనీకాంత్ కోలుకోవాలని పూజలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: నటుడు రజనీకాంత్ త్వరగా కోలుకొని పూర్తి ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని కోరుతూ ఆయన కుమార్తె సౌందర్య తన భర్తతో కలిసి గురువారం చెన్నై తిరువొట్రియూర్‌లోని వడివుడై అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి ఓ భక్తుడు రజనీకాంత్ గురించి సౌందర్య వద్ద అడగ్గా.. తన తండ్రి ఆరోగ్యంగా ఉన్నారని సమాధానమిచ్చినట్లు తెలిసింది. చెన్నై అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రజనీకాంత్‌ను ప్రస్తుతం జనరల్ వార్డుకు తరలించినట్లు సమాచారం.



హారతి తీసుకుంటున్న సౌందర్య రజనీకాంత్

సైబర్ నేరాలు అరికట్టేందుకు ఐఐటీఎంలో శిక్షణ

వడపళని, న్యూస్‌టుడే: దేశంలో చట్టాన్ని అమలు చేసే అధికారుల కోసం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్(ఐఐటీఎం) ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ 'సైబర్ కమాండోస్' అనే కొత్త తరహా శిక్షణ కేంద్రాన్ని గురువారం ప్రారంభించింది. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సహకారంతో ప్రారంభించినట్లు ఐఐటీ పేర్కొంది. సైబర్ దాడులు, సమస్యాత్మకమైన డాటాను భద్రపరచడంపై శిక్షణ ఇవ్వనున్నారు. ఐఐటీ డైరెక్టర్, ఆచార్యులు వి.కామకోటి మాట్లాడుతూ రోజురోజుకీ సైబర్ నేరాలు పెచ్చుమీరుతున్నాయని, డిజిటైజేషన్ కోసం పలు రకాలైన ఉపకరణాలు అందుబాటులోకి వస్తున్నాయని తెలిపారు. శిక్షణ ద్వారా రానున్న ఆరు నెలల్లో మంచి మార్పు కనిపిస్తుందన్నారు. రాష్ట్ర సైబర్ క్రైం విభాగ ఏడీజీపీ డాక్టర్ సందీప్ మిట్టల్ మాట్లాడుతూ మోసాలకు పాల్పడే వారికి సైబర్ అనేది వారధిగా కనిపిస్తోందన్నారు. 2024 నాటికి రెఫ్రిజిరేటర్లు, మైక్రోవేవ్‌ఓవెన్లు, వాషింగ్ మెషిన్లు వంటి పరికరాలు ఇంటర్‌నెట్‌తో కూడుకుని ఉంటాయని పేర్కొన్నారు. ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సి), డిప్యూటీ డైరెక్టరు మాయంక్ ఘిల్డియాల్, ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఎంజే శంకర్ రామన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న వి.కామకోటి, డాక్టర్ సందీప్ మిట్టల్

అధ్యాపకులను నియమించలేకపోతే కళాశాలలు మూసేయొచ్చు: హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: న్యాయ కళాశాలల్లో అధ్యాపకులను నియమించలేకపోతే వాటిని మూసేయొచ్చని మద్రాసు హైకోర్టు తెలిపింది. రాష్ట్రంలోని ప్రభుత్వ న్యాయ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులకు ప్రత్యక్ష నియామకాలు చేపట్టాలని వసంతకుమార్ అనే వ్యక్తి మద్రాసు హైకోర్టులో 2018లో పిటిషన్ దాఖలు చేశారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. లీగల్ ఎడ్యుకేషన్ డైరెక్టరు తరపున దాఖలు చేసిన జవాబు పిటిషన్‌లో.. రాష్ట్రంలోని 15 ప్రభుత్వ న్యాయ కళాశాలల్లో అనుమతించిన 20 అసోసియేట్ ప్రొఫెసర్ల పోస్టులలో 19 ఖాళీగా ఉన్నట్లు, మొత్తం ఉన్న 206 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల్లో 70 ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వ న్యాయ కళాశాలలో అధిక ఖాళీలు ఉండటం దురదృష్టమని న్యాయమూర్తి తెలిపారు. పోస్టులు భర్తీ చేయకుండా న్యాయవిద్య ఎలా అందించగలరని విద్యార్థులు ఆశిస్తారన్నారు. సక్రమంగా అర్హత ఉన్న అధ్యాపకులను నియమించడం కుదరకపోతే న్యాయ కళాశాలలను మూసి వేయడం మంచిదన్నారు. అర్హులను నియమించకుండా గెస్ట్ లెక్చరర్లతో పాఠాలు బోధిస్తే విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తోందని, దీనిని ఆమోదించరన్నారు. న్యాయశాఖ కార్యదర్శి 15న కోర్టులో హాజరవ్వాలని ఉత్తర్వులు ఇచ్చి విచారణ వాయిదా వేశారు.

నారాయణస్వామివి ఆధారాల్లేని ఆరోపణలు

మంత్రి నమశ్శివాయం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆధారాల్లేని అవాస్తవాలు చెబుతున్నారని పుదుచ్చేరి మంత్రి నమశ్శివాయం ఆరోపించారు. కర్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, పుదుచ్చేరి రాష్ట్ర కర్లింగ్ ఫెడరేషన్ సంయుక్తంగా జాతీయస్థాయి పోటీలు తొలిసారిగా పుదుచ్చేరిలో రెండ్రోజులపాటు నిర్వహిస్తుంచారు. ప్రారంభోత్సవం ఉప్పలం రాజీవ్‌గాంధీ క్రీడామైదానంలో గురువారం జరిగింది. నమశ్శివాయం పోటీలు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. బడ్జెట్‌లో పుదుచ్చేరి క్రీడాశాఖకు రూ.32కోట్లు నిధులు కేటాయించినట్లు తెలిపారు. చాలాకాలంగా జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రోత్సాహక నగద ఇవ్వలేదని, ప్రస్తుతం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రస్తుత ఎంపీ వైద్యలింగం ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పులుల సంచారం పుదుచ్చేరిలో ఉందని చెప్పి దిల్లీ వెళ్లిపోయారన్నారు. అలానే ఇప్పుడు నారాయణస్వామి అవాస్తవాలు చెబుతున్నారని తెలిపారు.



పోటీల ప్రారంభోత్సవంలో మంత్రి నమశ్శివాయం తదితరులు



సమావేశంలో పాల్గొన్న మంత్రి మూర్తి, అధికారులు

అధికారుల పనితీరుపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: వాణిజ్య పన్నులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల పని సామర్థ్యంపై సమీక్ష గురువారం చెన్నై నందనంలోని సమీకృత వాణిజ్య పన్నుల విభాగ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి శాఖ మంత్రి మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 2024 సెప్టెంబర్ నెలకుగాను అన్ని రిజిస్ట్రేషన్ల శాఖ ఉపాధ్యక్షులు, జిల్లా రిజిస్ట్రార్లు, జిల్లా రెవెన్యూ అధికారులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు తదితర అధికారుల పనితీరు గురించి చర్చించారు. సమావేశంలో శాఖ ముఖ్య కార్యదర్శి బ్రజేంద్ర నవనీత్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విగ్రహాల చోరులను అరెస్టు చేయండి

మాజీ ఐజీ పొన్ మాణిక్కవేల్

ప్యారిస్, న్యూస్‌టుడే: తంజావూరు బృహదీశ్వరర్ ఆలయంలో ఉన్న రాజరాజచోళన్ విగ్రహం ఆ గుడికి చెందినది కాదని ఓ అధికారి కోర్టులో తెలపడం దిగ్భ్రాంతికి గురిచేస్తోందని మాజీ ఐజీ పొన్‌మాణిక్కవేల్ తెలిపారు. ఆయన చెన్నై నుంగంబాక్కంలోని సీబీఐ కార్యాలయంలో బుధవారం హాజరై సంతకం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. కాంచీపురం ఏకాంబరనాథర్ విగ్రహంపై ఇది వరకే కోర్టులో కేసు ఉంది. అందులో 8.7 కిలోల బంగారం చోరీకి గురైనట్లు గతంలోనే ఫిర్యాదు అందింది. సోమస్కంధర్ విగ్రహం అమెరికాలో ఉన్నట్లు 2018లో తానే మొదట గుర్తించినట్లు పేర్కొన్నారు. తమిళనాడు ఆలయాల విగ్రహాలు విదేశాలకు అక్రమంగా తరలించినట్లు 45 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎందుకు కేసులు నమోదు చేయలేదన్నారు. విదేశాల్లో ఉన్న విగ్రహాలు తమిళనాడుకు తీసుకురావడానికి విగ్రహాల అక్రమ రవాణా నియంత్రణ విభాగం పోలీసుల వల్ల కాలేదన్నారు. సోమస్కంధర్ విగ్రహాన్ని చోరీ చేయడానికి 1991 నుంచి కుట్ర పన్నినట్లు చెప్పారు. దేవాదాయశాఖ నిర్వహణ సరిలేదని, ఆ శాఖ వచ్చిన తర్వాత సుమారు 638 విగ్రహాలు చోరీకి గురయ్యాయని ఆరోపించారు. విగ్రహాల స్మగ్లర్ సుభాష్ చంద్రకపూర్ సోదరి సుష్మా జెరీన్, కుమార్తె మమతా కపూర్ విదేశాల్లో రూ.250 కోట్లు విలువైన విగ్రహాలను తమ ఆధీనంలో ఉంచుకున్నారన్నారు. వారిని అరెస్టు చేసి తమిళనాడుకు తీసుకొచ్చేందుకు పోలీసులు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. విగ్రహాల అక్రమ రవాణా కేసుతో సంబంధం ఉన్న, సింగపూర్‌లో ఉంటున్న పరమేశ్వరి పొన్నుసామిని అరెస్టు చేసి రాష్ట్రానికి తీసుకురావాలని తెలిపారు.



చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలోని డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మాడ్రనైజేషన్ ప్రోగ్రాం కింద నెలకొల్పిన అధునాతన శిక్షణ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి రామచంద్రన్ ప్రారంభించారు. పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.
– వేళచ్చేరి, న్యూస్‌టుడే

భేషుగ్గా బిర్యానీ విక్రయాలు

❖ రాష్ట్రంలో ఏడాదికి రూ.11 వేల కోట్ల వ్యాపారం
❖ చెన్నైలోనే రూ.5,500 కోట్ల అమ్మకాలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: మంసాహార ప్రియులు ఇష్టమైన ఆహారం చికెన్, మటన్ బిర్యానీ. కార్యక్రమం ఏదైనా బిర్యానీ ఉండాల్సిందే అన్నట్లు ఉంది. అందుకే బిర్యానీ హోటళ్లు కళకళలాడుతున్నాయి. మాంసాహార బిర్యానీలో పలు రకాలున్నాయి. ఆంబూర్, హైదరాబాద్, దిండిగల్లు, జీలకర్ర సంబా, బాస్మతి, మొఘలాయి సహా 10 రకాలు పేరుగాంచాయి. బిర్యానీ ప్రియుల సంఖ్య పెరగడంతో వ్యాపారం కూడా విస్తరించింది. రాష్ట్రంలో ఏడాదికి రూ.11 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందంటే ఈ ఆహారంపై జనాలకుండే మక్కువ అర్థమవుతోంది. ఇందులో చెన్నైలోనే రూ.5,500 కోట్ల విక్రయం జరుగుతోంది. ఏటా 10 శాతం పెరుగుతోంది. చెన్నై వంటి మహా నగరాలలో ప్రస్తుతం బిర్యానీకిగాను ప్రత్యేక హోటళ్లు ప్రారంభించే స్థాయికి వ్యాపారం పుంజుకుంది. దీని గురించి 'జూనియర్ కుప్పన్నా' హోటల్ ఎండీ, జాతీయ హోటళ్ల సంఘ చెన్నై విభాగ సంయుక్త అధ్యక్షుడు బాలచందర్ మాట్లాడుతూ.. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఇష్టపడి తినే ఆహారం బిర్యానీ అని చెప్పారు. ఇందులో సైడ్ డిష్ తీసుకోనవసరం లేదన్నారు. అందువల్ల తినడానికి ఇష్ట పడుతున్నారని తెలిపారు. జూనియర్ కుప్పన్నా హోటల్‌కు 49 శాఖలున్నాయని, వాటిలో 35 శాతం బిర్యానీ విక్రయం అవుతుందని పేర్కొన్నారు. నెలకు లక్ష ప్లేట్ల చొప్పున ఏడాదికి 12 లక్షల ప్లేట్లు విక్రయిస్తామన్నారు. రోజుకు సరాసరి 3 వేల ప్లేట్ల చొప్పున అమ్ముడవుతోందని, అదేవిధంగా అన్ని హోటళ్లలో బిర్యానీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో హోటల్ వృత్తిలో దిల్లీ మొదటి స్థానంలో ఉండగా ముంబయి, బెంగళూరు, చెన్నై వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.





భూమి ఇచ్చినవారిని సత్కరిస్తున్న బుస్సీ ఆనంద్

టీవీకే మహానాడుకు ఆహ్వానాలు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం మొదటి రాష్ట్ర మహానాడు ఈనెల 27న విక్రవాండి సమీప వి.సాలై ప్రాంతంలో నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేదిక నిర్మాణానికి మొదట మహాలయ అమావాస్య రోజైన బుధవారం భూమిపూజ నిర్వహించాలని పార్టీ అధ్యక్షుడు విజయ్ నిర్ణయించగా పలు కారణాలతో వాయిదా పడింది. శుక్రవారం వేకువ జామున 4.30 నుంచి 6 గంటలలోగా భూమి పూజ జరపడానికి నిర్ణయించారు. ఇదిలా ఉండగా మహానాడు నిర్వహణకు భూమి ఇచ్చిన 25 మందికి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ బుధవారం రాత్రి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆయన వెంట విళుపురం జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి బాలాజీ, జిల్లా అధ్యక్షుడు ఖుషీ మోహన్, ఉపాధ్యక్షుడు వడివేల్, న్యాయవాది అరవింద్, యువజన విభాగం అధ్యక్షుడు మోహన్, విక్రవాండి యూనియన్ అధ్యక్షుడు శేఖర్ తదితరులు ఉన్నారు.

ఉప ముఖ్యమంత్రికి అదనపు అధికారం?

చెన్నై, న్యూస్‌టుడే: ఉదయనిధికి అదనపు అధికారం అందించనున్నట్లు తెలిసింది. మంత్రివర్గం పునర్వ్యవస్థీకరణలో భాగంగా మంత్రి ఉదయనిధిని ఉప ముఖ్యమంత్రిగా నియమించిన విషయం తెలిసిందే. మంత్రివర్గం పూర్తి జాబితాను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి మురుగానందం విడుదల చేయగా అందులో ఉదయనిధికి మూడోస్థానం కల్పించారు. మంత్రివర్గ సమావేశం 8న జరగనుంది. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రికి అదనపు అధికారానికి ఆమోదం అందించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కరూర్‌లో బీఎస్పీ సమావేశం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: కరూర్ నగరపాలక సంస్థ పరిధిలోని ప్రైవేట్ ఆడిటోరియంలో బుధవారం బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర, జిల్లా నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్రన్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి అన్బళగన్, సమన్వయకర్త జయగోపాల్ మదురైవీరన్, పార్లమెంట్ ఇన్‌ఛార్జి రవి, రాష్ట్ర కార్యదర్శి కరుప్పయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇలమన్ శేఖర్, రాష్ట్ర, జిల్లా, ప్రాంతీయ స్థాయి నిర్వాహకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా రామచంద్రన్, సమన్వయకర్తలుగా జయగోపాల్ మదురైవీరన్‌లు ఎంపికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి కరుప్పయ్య విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జిల్లాల వారీగా పార్టీని బలోపేతం చేయడానికి జిల్లాలో కొత్త నిర్వాహకులను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసును జాతీయ అధ్యక్షురాలు మాయావతి డిమాండ్ మేరకు సీబీఐకు అప్పగించాలన్నారు. తమిళగ వెట్రి కళగం జెండాపై ఏనుగు గుర్తుపై బీఎస్పీ తరపున కార్యదర్శి సతీష్ చంద్ర మరోసారి ఎన్నికల కమిషన్‌కి లేఖ రాసినట్లు గుర్తుచేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరుప్పయ్య

కోవై పోలీసులతో డీజీపీ సమాలోచన

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ కోయంబత్తూరులోని నగర పోలీసు కమిషనర్ కార్యాలయానికి గురువారం విచ్చేశారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ డైరెక్టర్ అజయ్ పట్నాకర్, సిటీ పోలీసు కమిషనర్ బాలకృష్ణన్, డిప్యూటీ కమిషనర్ స్టాలిన్, పోలీసు ఉన్నతాధికారులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు.



కమిషనర్ కార్యాలయం వద్ద డీజీపీ శంకర్ జివాల్

హార్‌స్కో సంస్థతో సీఎంఆర్ఎల్ ఒప్పందం

వడపళని, న్యూస్‌టుడే: డిజైన్, తయారు చేసి సరఫరా చేసేందుకు, పరీక్షలు, ఏర్పాటు, నిర్వహణ తదితరాలకు చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) యూఎస్ఏలోని 'హార్‌స్కో రైల్ ఎల్ఎల్‌సీ' సంస్థకు రూ.53.02 కోట్లతో కాంట్రాక్టు అప్పగించింది. ఇందుకు సంబంధించిన ఒప్పంద కార్యక్రమం జులై 17వ తేదీన జరిగిందని సీఎంఆర్ఎల్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. సీఎంఆర్ఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టరు టి.అర్జునన్, హార్‌స్కో సంస్థ ఎండీ సిద్ధార్థ్ శ్రీనివాసన్‌లు ఒప్పందాలు మార్చుకున్నారు. మెట్రో సంస్థ సీజీఎం లివింగ్‌స్టన్, చీఫ్ ట్రాక్ ఎక్స్‌పర్ట్ కాళిముత్తు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఒప్పందాలతో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై - జెడ్డా విమాన సర్వీసు పునర్‌ప్రారంభం

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నుంచి జెడ్డాకు విమాన సర్వీసులు బుధవారం నుంచి తిరిగి ప్రారంభమయ్యాయి. కరోనా సమయంలో సేవలు రద్దయిన తర్వాత దాదాపు నాలుగేళ్ల విరామం అనంతరం సౌదీ అరేబియన్ ఎయిర్‌లైన్స్ సేవలు ప్రారంభించింది. ప్రస్తుతం వారంలో సోమ, బుధవారాలు నడుస్తుంది. బుధవారం మధ్యాహ్నం 12.00 గంటలకు 132 మంది ప్రయాణికులతో జెడ్డాలో బయలుదేరిన విమానం చెన్నైకి సాయంత్రం 5.15 గంటలకు చేరుకుంది. తిరిగి జెడ్డాకు రాత్రి 7 గంటలకు 222 మందితో బయలుదేరిందని అధికారులు తెలిపారు. చెన్నై నుంచి జెడ్డాకు ప్రయాణ సమయం 5.30 గంటలు. త్వరలో శుక్రవారంతో పాటు వారంలో మూడు రోజులు నడపాలనుకుంటున్నామని సంస్థ పేర్కొంది.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పొన్నేరి, మేడూరు, టైడల్ పార్కు, రాజకీల్‌పాక్కం, నప్పాలయం, మాంగాడు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్తు వినియోగదారుల సమావేశం నేడు

వడపళని, న్యూస్‌టుడే: ఎగ్మూరు, ఆవడి, పెరంబూరు ప్రాంతాల విద్యుత్తు వినియోగదారుల సమావేశం శుక్రవారం జరుగుతుందని టాన్‌జెడ్కో గురువారం పేర్కొంది. ఎగ్మూరు వాసులకు ఓట్టేరి కూక్స్ రోడ్డులోని సబ్‌స్టేషను కాంప్లెక్సులోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కార్యాలయంలో, ఆవడి వాసులకు ఎన్ఎం రోడ్డులోని ఈఈ కార్యాలయం, పెరంబూరు ప్రాంతానికి ఎంఈఎస్ రోడ్డులో ఉన్న 110 కేవీ సెంబియం సబ్ స్టేషనులో ఉదయం 11 గంటలకు ఉంటాయని తెలిపింది.

డీడీ ఛానెళ్లలో 'ఎయిర్ షో' ప్రత్యక్ష ప్రసారం

వడపళని, న్యూస్‌టుడే: భారత వైమానిక దళ 92వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీ జరిగే వేడుకలు, 6వ తేదీ చెన్నైలోని మెరీనా తీరంలో జరిగే వాయు విన్యాసాలు దూరదర్శన్‌లో ప్రసారం కానున్నాయి. మెరీనాలో 6న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే విన్యాసాలు డీడీ భారతి, డీడీ తమిళ్ ఛానెల్‌లో, 8వ తేదీ తాంబరం ఎయిర్ ఫోర్స్ స్టేషనులో ఉదయం 07.45 నుంచి 09 గంటల వరకు జరిగే వార్షిక వేడుకలు డీడీ భారతి, డీడీ తమిళ ఛానెల్లో ప్రత్యక్ష ప్రసారం కానున్నాయని ప్రసార భారతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొంది. డీడీ నేషనల్ యూట్యూబ్, డీడీ యూట్యూబ్, డీడీ తమిళ యూట్యూబ్ ఛానెళ్లలో కూడా ప్రసారమవుతాయి.

పలు రైళ్ల సేవల్లో మార్పు

వడపళని, న్యూస్‌టుడే: తిరుచ్చిరాపల్లి డివిజన్‌లో జరుగుతున్న ఇంజినీరింగు పనుల కారణంగా పలు రైళ్ల సేవల్లో మార్పులు జరిగాయని దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది.

✷ **17655** కాకినాడ పోర్ట్ - పుదుచ్చేరి 14.30 రైలు 6న చెంగల్పట్టు వరకు నడుస్తుంది. ✷ **17654** పుదుచ్చేరి - కాచిగూడ 13.00 రైలు 7న చెంగల్పట్టులో 15.30కు బయలుదేరుతుంది. ✷ **16116** పుదుచ్చేరి - ఎగ్మూరు 7, 9, 11 తేదీలు 05.35కు బయలుదేరాల్సిన రైలు ముండియంపాక్కంలో 06.40కు బయలుదేరుతుంది. ✷ **20606** తిరుచెందూరు - ఎగ్మూరు 6, 8, 10 తేదీలు 20.25 రైలు 22.35కు నడుస్తుంది.

✷ **సికింద్రాబాదు డివిజన్‌లో.. 12433** చెన్నై సెంట్రల్ - హజరత్ నిజాముద్దీన్ 6న 06.05కు బయలుదేరాల్సిన రైలు 09.05కు బయలుదేరుతుంది. ✷ **03248** ఎస్ఎంవీటీ బెంగళూరు - ధనపూర్ వయా జోలార్‌పేట్టై, కాట్పాడి, పెరంబూరు 5వ తేదీ 23.25కు బయలుదేరాల్సిన రైలు రద్దయింది. ✷ **12611** చెన్నై సెంట్రల్ - హజరత్ నిజాముద్దీన్ 5న 06.00 బయలుదేరాల్సిన రైలు 08.00కు ఆలస్యంగా నడుస్తుంది.

అమావాస్యలోపు సెంథిల్ బాలాజీ పదవి కోల్పోతారు

అన్నాడీఎంకే మాజీ మంత్రి మణియన్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: రానున్న అమావాస్యలోపు మంత్రి సెంథిల్ బాలాజీ పదవీచ్యుడవుతాడని అన్నాడీఎంకే మాజీ మంత్రి ఓ.ఎస్.మణియన్ జోస్యం చెప్పారు. మైలాడుదురై జిల్లా సెంబనార్‌కోవిల్ ప్రాంతంలో అన్నాడీఎంకే తరఫున అన్నాదురై 166వ జయంత్యుత్సవ బహిరంగసభ బుధవారం రాత్రి నిర్వహించారు. మాజీమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర మత్స్యకారుల పడవలపై శ్రీలంక దాడులు జరిపి వాటిని స్వాధీనం చేసుకొని జాలర్ల జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. వారికి జరిమానా కూడా విధించారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. తిరుక్కడైయూర్ యూనియన్ పార్టీ కార్యదర్శి జనార్థన్ నేతృత్వంలో నిర్వహించిన సభలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలతో అనర్థాలపై అవగాహన ర్యాలీ 6న

ప్యారిస్, న్యూస్‌టుడే: తెన్‌కాశి జిల్లాలో పనిచేస్తున్న 'వాయిస్ ఆఫ్ తెన్‌కాశి' ఫౌండేషన్ తరఫున మత్తుపదార్థాల నియంత్రణపై 6వ తేదీ శంకరన్‌కోవిల్‌లో 2 కి.మీ అవగాహన ర్యాలీ జరగనుంది. ఇందులో గవర్నర్ ఆర్ఎన్ రవి పాల్గొననున్నారు. ఇందుకు సంబంధించి ఫౌండేషన్ నిర్వాహకుడు ఆనంద్ అయ్యాసామి గురువారం విలేకరులతో మాట్లాడుతూ... దేశంలోనే తమిళనాడులో మత్తుపదార్థాలు అధికంగా దొరుకుతున్నాయని తెలిపారు. ప్రజలు, విద్యార్థులకు మత్తుపదార్థాలతో అనర్థాలను వివరించేందుకు ర్యాలీని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

అన్ని రైల్వే సేవలు ఒకేచోట

మూడు నెలల్లో అందుబాటులోకి 'సూపర్ యాప్'

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రైల్వే సేవలన్నీ ఒకే యాప్‌లో పొందడానికి 'సూపర్' పేరుతో యాప్ మరో మూడు నెలలలో అందుబాటులోకి వస్తుందని రైల్వే అధికారులు చెబుతున్నారు. 85 శాతానికి పైగా రైలు ప్రయాణికులు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్, యాప్ ద్వారా టికెట్‌లు రిజర్వేషన్ చేసుకుంటున్నారు. గూడ్సు, పర్యాటక రైళ్లకు ప్రత్యేక యాప్‌లను ఉపయోగించుకుంటున్నారు. పలు రకాల సేవలు పొందడానికి ప్రయాణికులు శ్రమకోర్చాల్సి వస్తోంది. అందువల్ల రైల్వే సేవలన్నీ ఒకే యాప్‌లో పొందేలా 'సూపర్ యాప్'ని రూపొందిస్తున్నారు. దీని గురించి రైల్వే అధికారులు మాట్లాడుతూ.. రూపొందించనున్న యాప్‌లో త్వరగా టికెట్‌లు రిజర్వేషన్ చేసుకోవచ్చని చెప్పారు. అన్ రిజర్వుడ్ టికెట్‌లు కూడా పొందవచ్చని తెలిపారు. టికెట్‌లు రద్దు చేసిన 24 గంటలలో టికెట్‌కు చెల్లించిన ఛార్జీ తిరిగి పొందవచ్చని, పీఎన్ఆర్ సరిచూసుకోవడం, రైలు మార్గాన్ని వీక్షించడం, ఆహారం ఆర్డర్, విమాన టికెట్ రిజర్వేషన్, విశ్రాంతి గదులు, కాల్‌టాక్సీ సౌకర్యాలు పొందవచ్చని పేర్కొన్నారు. అదేవిధంగా సరకు పంపడం, అందుకుగాను దస్త్రాలు సమర్పించడం, ఫీజు చెల్లించడం తదితర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఈ మొబైల్ యాప్ రూపకల్పన పనులు చివరి దశలో ఉన్నాయని, మరో మూడు నెలల్లో అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

నకిలీ ఆధార్‌కార్డులతో బంగ్లాదేశ్ కార్మికులు

తయారు చేసిన వ్యక్తి అరెస్టు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుప్పూర్‌లో కొన్నిరోజుల క్రితం ఎలాంటి ప్రభుత్వ ధ్రువపత్రాలు లేకుండా బస చేస్తున్న బంగ్లాదేశ్‌కు చెందిన 12మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. అందులో కొందరికి తిరుప్పూర్ అరుల్‌పురానికి చెందిన మారిముత్తు అనే వ్యక్తి నకిలీ ఆధార్‌కార్డులు సృష్టించి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో అతన్ని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ ఆధార్‌కార్డులకు సంబంధించి ప్రత్యేక బృంద పోలీసులు మారిముత్తు వద్ద దర్యాప్తు జరిపారు. అతను తిరుప్పూర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజలకు అర్జీలు రాసిస్తుంటాడని, బంగ్లాదేశ్ నుంచి వచ్చేవారి నుంచి వేలల్లో నగదు తీసుకొని నకిలీ ఆధార్‌కార్డులు తయారుచేసి ఇస్తున్నట్లు తేలింది. కార్పొరేషన్ కార్యాలయంలో అతని బ్యాగుని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో 200 నకిలీ ఆధార్‌కార్డుల దరఖాస్తులను గుర్తించారు.



యాప్ ఆవిష్కరిస్తున్న పోలీసు అధికారులు

నేరాల నియంత్రణకు యాప్ ఆవిష్కరణ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకు ప్రజలు సులభతరంగా ఫిర్యాదు చేసేవిధంగా తంజావూర్ జిల్లా ఎస్పీ కార్యాలయం తరఫున 'ఉరక్కసొల్' అనే మొబైల్ యాప్‌ను రూపొందించారు. గురువారం దీనిని డీఐజీ జియావుల్ హక్, జిల్లా ఎస్పీ ఆశిష్‌రావత్ ఆవిష్కరించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ... ప్రతిఒక్కరు 'ఉరక్కసొల్' యాప్‌ని తమ మొబైల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని సాయం పొందాలని సూచించారు. ఇందులో మత్తుపదార్థాల చలామణి, జూదం, లాటరీ టిక్కెట్లు, సారా విక్రయాలు, ఇసుక చోరీ, బాలికలపై అఘాయిత్యాల గురించి ఫిర్యాదు చేయవచ్చని, వాటిపై తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



విరిగిన ట్రాక్

రైలుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

అరక్కోణం, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్రం తిరువనంతపురం నుంచి చెన్నై వెళ్లే తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్ రైలు గురువారం అరక్కోణం సమీప పులియమంగళం రైల్వేస్టేషన్ వద్ద వెళ్తుండగా పట్టాల నుంచి విభిన్న శబ్దం వచ్చింది. ట్రాక్‌మెన్ వెంటనే అప్రమత్తమై వేగంగా వస్తున్న తిరువనంతపురం రైలుకు ఎర్రజెండా చూపించి ఆపడానికి యత్నించాడు. రైలు వేగంగా ముందుకు పోవడంతో ఆందోళన చెందిన అతను రైలులోని ప్రయాణికులను ప్రమాద గొలుసు లాగాలని కోరాడు. ఓ ప్రయాణికుడు అప్రమత్తమై బోగీలోని ప్రమాద గొలుసును లాగడంతో రైలు ఆగిపోయింది. అక్కడ రైలు పట్టా విరిగి ఉండటాన్ని గుర్తించి వెంటనే సమాచారాన్ని అరక్కోణం రైల్వేస్టేషన్ అధికారులకు చేరవేశాడు. అధికారులు, సిబ్బంది అక్కడకు చేరుకుని పట్టాకు మరమ్మతులు చేశారు. దీంతో 30 నిమిషాలు ఆలస్యంగా రైలు చెన్నైకి బయలుదేరింది.

విన్యాసాల వీక్షణ ఏర్పాట్లు పరిశీలన

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై మెరీనాలో యుద్ధ విమానాల విన్యాసాలు తిలకించేందుకు చేసిన ఏర్పాట్లను ప్రజాపనుల శాఖ మంత్రి ఏవీ వేలు గురువారం పరిశీలించారు. 6న ప్రదర్శించే విన్యాసాలను ప్రజలు ఉచితంగా తిలకించొచ్చు. 15 లక్షల మంది వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రజలకు అవసరమైన తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఉన్నతాధికారులు పలువురు ఉన్నారు.




ఏర్పాట్లు పరిశీలిస్తున్న మంత్రి ఏవీ వేలు

బ్యాటరీతో నడిచే సైకిల్

రూపొందించిన విద్యార్థి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: సేలం జిల్లా పెత్తనాయక్కన్‌పాళ్యం ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి అభిషేక్ బ్యాటరీతో నడిచే సైకిల్ తయారు చేశాడు. ఆ సైకిల్‌పైనే నిత్యం బడికి వెళ్లి వెళ్లి వస్తున్నాడు. విషయం తెలుసుకున్న పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తన ఎక్స్ పేజీలో విద్యార్థిని అభినందిస్తు పోస్ట్ పెట్టారు. అభిషేక్‌తో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. విజ్ఞానశాస్త్రంలో ఆసక్తి ఉన్న వారందరికీ ఆదర్శంగా నిలుస్తావని పేర్కొన్నారు.





మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతున్న అభిషేక్



ఊటీలో దర్శనమిచ్చిన తోకచుక్క

విల్లివాక్కం, న్యూస్‌టుడే: పశ్చిమ కనుమల సమీపంలో ఊటీవద్ద ఈనెల 1న సాయంత్రం 6 గంటలకు అరుదైన తోకచుక్క దర్శనమిచ్చింది. 10 నిమిషాల వరకు వెలుగులీనుతూ కనిపించింది. 80 వేల ఏళ్లనాటి అరుదైన తోకచుక్క అని నాసా పరిశోధకుడు జనార్దన్ నంజుండన్ తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో అభియోగపత్రం దాఖలు

ప్యారిస్, న్యూస్‌టుడే: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో 5 వేల పేజీల అభియోగపత్రాన్ని ఎగ్మూర్ కోర్టులో పోలీసులు దాఖలు చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు 28 మందిని అరెస్టు చేశారు. అందులో కాంగ్రెస్, అన్నాడీఎంకే, డీఎంకే మొదలైన పార్టీలకు చెందిన మాజీ నాయకులు, పేరుమోసిన రౌడీషీటర్లు, న్యాయవాదులు ఉన్నారు. అరెస్టయిన తిరువేంగడం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందాడు. మిగిలినవారిని వేర్వేరుగా పోలీసులు కస్టడీకి తీసుకుని దర్యాప్తు చేయగా తమ పనులకు అడ్డుగా ఉండటంతో ఆర్మ్‌స్ట్రాంగ్‌ను చంపినట్లు అంగీకరించారు. ఈ నేపథ్యంలో ప్రాథమిక దర్యాప్తు పూర్తయిన స్థితిలో సెంబియం ప్రత్యేక బృంద పోలీసులు చెన్నై ఎగ్మూర్ కోర్టులో 5 వేల పేజీలతో అభియోగపత్రం దాఖలు చేశారు. అందులో.. ఇప్పటివరకు 28 మందిని అరెస్టు చేశామని, పరారీలో ఉన్న రౌడీషీటర్ శంబో సెంథిల్, న్యాయవాది మొట్టై కృష్ణన్ పేర్లు కనబరిచారు. స్వాధీనం చేసుకున్న నగదు, పత్రాలు, సాక్ష్యాలు మొదలైన వాటిని జత చేశారు. ఈ కేసులో ఏ-1గా రౌడీషీటర్ నాగేంద్రన్, ఏ-2గా పరారీలో ఉన్న శంబో సెంథిల్, ఏ-3గా రౌడీషీటర్ నాగేంద్రన్ కుమారుడు అశ్వత్థామన్‌ని చేర్చినట్లు తెలుస్తోంది.

కొడనాడు కేసులో ఇద్దరి వద్ద సీబీసీఐడీ దర్యాప్తు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: దివంగత ముఖ్యమంత్రి జయలలిత కొడనాడు ఎస్టేట్ బంగ్లాలో కాపలాదారుడిగా పని చేసిన ఓంబహదూర్ 2017లో హత్యకు గురయ్యాడు. దుండగులు ఎస్టేట్‌లోని దస్త్రాలు, ఇతర వస్తువులు దోచుకెళ్లారు. ఈ కేసును తొలుత నీలగిరి జిల్లా పోలీసులు దర్యాప్తు చేశారు. అనంతరం సీబీసీఐడీకి బదిలీ అయింది. సయాన్, వళైయరాజ్, మనోజ్ అనే వ్యక్తులు సహా 19 మందిని అరెస్టు చేశారు. జయలలిత కారు డ్రైవరు కనకరాజ్ కారు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ కేసుకు సంబంధించి సీబీసీఐడీ పోలీసులు ఇప్పటివరకు మొత్తం 500 మంది వద్ద దర్యాప్తు చేపట్టి సమ్మన్లు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కొడనాడు ఎస్టేట్‌లోని ఆలయంలో ఏళ్ల తరబడి పూజారిగా ఉన్న విగ్నేష్, పుదుచ్చేరిలోని బ్యాంకు మేనేజరు కోవైలోని సీబీసీఐడీ కార్యాలయంలో గురువారం దర్యాప్తునకు హాజరయ్యారు.



దర్యాప్తునకు వస్తున్న విగ్నేష్, బ్యాంక్ మేనేజర్

కనల్ కణ్ణన్‌పై కేసు కొట్టివేత

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై మధురవాయల్‌లో ఇదివరకు జరిగిన ఓ సమావేశంలో సినీ స్టంట్ మాస్టర్, హిందూ మున్నని నేత అయిన కనల్ కణ్ణన్ పాల్గొని మాట్లాడారు. శ్రీరంగం రంగనాథర్ ఆలయం ప్రాంగణంలో భగవంతుడిని కించపరిచే వచనాలతో ఉన్న విగ్రహాన్ని ధ్వంసం చేసిన రోజే హిందువులకు ఆవిర్భావ దినోత్సవం అని వ్యాఖ్యానించారు. దీంతో తంథై పెరియార్ ద్రావిడ కళగం ఫిర్యాదు మేరకు కనల్ కణ్ణన్‌పై చెన్నై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎగ్మూర్ కోర్టులో విచారణలో ఉంది. ఈ క్రమంలో ఈ కేసుని కొట్టేయాలని కోరుతూ కనల్ కణ్ణన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో... ఆలయం ముందు భగవంతుడిని నమ్మేవారు మూర్ఖులు, ఆరాధించేవారు అనాగరికులన్న వచనాలతో ఉన్న విగ్రహాన్ని పోలీసులు తొలగించాలని, విగ్రహాన్ని ఏర్పాటు చేసిన వారిపై కేసు నమోదు చేయడానికి బదులు తనపై కేసు నమోదు చేశారన్నారు. ఈ పిటిషన్‌ని విచారించిన జస్టిస్ జయచంద్రన్.. ఆలయానికి ఎదురుగా ఉన్న విగ్రహ పీఠంపై ఉన్న వచనాల గురించే పిటిషనరు మాట్లాడారని పేర్కొంటూ ఆయనపై కేసుని కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహావిష్ణుకు బెయిల్

ప్యారిస్, న్యూస్‌టుడే: సైదాపేట ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వివాదాస్పద ప్రసంగం చేసిన పరం పొరుళ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మహావిష్ణుపై సైదాపేట పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలో బెయిల్ కోరుతూ అతను అదనపు సెషన్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి చంద్రన్.. మహావిష్ణుకి బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పాఠశాలలకు బాంబు బెదిరింపులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి సమీప కాట్టూర్‌లోని మాన్‌ఫోర్ట్ ప్రైవేట్ సీబీఎస్ఈ మహోన్నత పాఠశాల ఈ-మెయిల్‌కు గురువారం తెల్లవారుజామున బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాబర్ట్ తిరువెరుంబూర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు బాంబుస్క్వాడ్‌తో అక్కడకు చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. గురువారం పాఠశాలకు సెలవు ప్రకటించారు. అదేవిధంగా జిల్లాలోని మరికొన్ని పాఠశాలలకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో జిల్లావ్యాప్తంగా పోలీసులు అప్రమత్తమయ్యారు. శ్వేతా బాలకృష్ణన్ పేరిట ఈ-మెయిల్ ఏడు పాఠశాలలకు, ఓ కళాశాలకు వచ్చింది. దీంతో ఆయా పాఠశాలల్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు.

ఆర్.ఎం.వీరప్పన్‌పై డాక్యుమెంటరీ

చెన్నై, న్యూస్‌టుడే: ఇటీవల మరణించిన సీనియర్ రాజకీయ నాయకుడు, సత్య మూవీస్ సంస్థ నిర్మాత ఆర్.ఎం.వీరప్పన్‌పై డాక్యుమెంటరీ రూపొందనుంది. సత్య మూవీస్ నిర్మాత తంగరాజ్ వీరప్పన్ నిర్మించనున్న ఈ డాక్యుమెంటరీ పర్యవేక్షణ బాధ్యతలను దర్శక నిర్మాత పదం వేణుకుమార్ చేపట్టనున్నారు. ఆర్.ఎం.వీరప్పన్ 99వ జయంతి సందర్భంగా ఇప్పటికే స్మారక గీతాన్ని సత్య మూవీస్ నిర్మించి గతనెల 9న విడుదల చేసింది. సినీ, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ డాక్యుమెంటరీలో ఆర్.ఎం.వీరప్పన్ గురించి తమ స్మృతులు పంచుకోనున్నారు. ఇందుకోసం ఇప్పటికే సంగీత దర్శకుడు ఇళయరాజాను తంగరాజ్ వీరప్పన్, పదం వేణుకుమార్ కలిశారు. డాక్యుమెంటరీలో పాల్గొనడానికి ఆయన సుముఖత వ్యక్తం చేశారని, ప్రపంచస్థాయిలో రూపొందించనున్నట్లు తంగరాజ్, పదం వేణుకుమార్ వెల్లడించారు.


ఇళయరాజాతో తంగరాజ్, పదం వేణుకుమార్

లబ్బర్ పందు దర్శకుడికి బంగారు గొలుసు

చెన్నై: గ్రామీణ క్రికెట్ నేపథ్యంతో కూడుకున్న 'లబ్బర్ పందు' విడుదలై ప్రేక్షకుల ఆదరాభిమానాలు చూరగొంటోంది. చిత్రబృందానికి సినీ, క్రికెట్ ప్రముఖులు పలువురు అభినందనలు, ప్రశంసలు వెల్లడిస్తున్నారు. చిత్రంలోని కథానాయకుల్లో ఒకరైన హరీశ్ కల్యాణ్ త్ర దర్శకుడు తమిళరసన్ పచ్చముత్తుకు బంగారు గొలుసు కానుకగా అందించారు.


దర్శకుడితో హరీశ్ కల్యాణ్

దళపతి 69లో ప్రియమణి



చెన్నై: 'దళపతి 69'లో దర్శకుడు గౌతం వాసుదేవ్ మేనన్, ప్రియమణి నటించనున్నట్లు ప్రస్తుతం ప్రకటించింది. ఇందుకు సంబంధించిన పోస్టర్లను చిత్రనిర్మాణ సంస్థ తన 'ఎక్స్' పేజీలో విడుదల చేసింది. గత ఏడాది విడుదలైన 'లియో' చిత్రంలోనూ విజయ్‌తో కలిసి గౌతం వాసుదేవ్ మేనన్ నటించడం గమనార్హం.

అందరికీ కృతజ్ఞతలు


ప్రసన్న

చెన్నై: దర్శకుడు ఆదిక్ రవిచంద్రన్, నటుడు అజిత్‌కుమార్ కాంబినేషన్లో రూపొందుతున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. అర్జున్ దాస్, ప్రసన్న ముఖ్యపాత్రల్లో నటించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రసన్న తన 'ఎక్స్' పేజీలో.. 'మంగాత్త' విడుదలైనప్పటి నుంచి అజిత్‌కుమార్ సినిమాల్లో తాను నటించనున్నట్లు ప్రచారం జరిగిందన్నారు. ప్రస్తుతం అది నెరవేరిందన్నారు. నిజం చేసిన దేవుడు, అజిత్‌కుమార్, సురేశ్‌చంద్ర, మైత్రి మూవీస్, ఆదిక్ రవిచంద్రన్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు పేర్కొన్నారు. చిత్రీకరణ స్పెయిన్ దేశంలో కొనసాగుతోందని వెల్లడించారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం


కాంచీపురం: శ్రీదేవి, భూదేవి సమేత సింగపెరుమాళ్

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని అనేక ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజ పెరుమాళ్‌కు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం 108 కాళ్ల మండపంలో రాత్రి ఊంజల్ సేవ జరిపారు. కామాక్షి అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఉదయం పూర్వాంగ హోమం నిర్వహించారు. సాయంత్రం వాస్తు శాంతి చేశారు. రాత్రి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో నవరాత్రి మండపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఏకాంబరేశ్వర ఆలయం వీధిలో ఉన్న సంతవేలి అమ్మవారి ఆలయంలో ఉత్సవాల మొదటి రోజున అమ్మవారు పంచముఖ వినాయకుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సెంగుంధర్ పూవరసు తోప్పులో వెలసిన రేణుకాంబాళ్ వెండి కవచంలో దర్శనమిచ్చారు.

ప్యారిస్: జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 3 నుంచి పదిరోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. గురువారం ఉదయం కలశ స్థాపనతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి త్రికాల అభిషేకాలు, అలంకరణలు, ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు సరస్వతిగా భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సుజిత భరతనాట్యం, సహస్రనామ మండలి సభ్యులు, స్వరాగ్న శైలేష్ జోస్యుల బృందం, ఎస్‌కేపీడీ, జీకేసీటీ పాఠశాల విద్యార్థుల భక్తిగేయాలాపన జరిగాయి. గురువారం ఉత్సవానికి శ్రీ కొల్లా సింగన్న శెట్టి ధర్మ సంస్థ ఉభయ కర్తగా వ్యవహరించింది. దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్‌తో పాటు పాలకమండలి సభ్యులు, కార్యదర్శి ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ప్యారిస్: సరస్వతి అవతారంలో..


పళ్లిపట్టు: బాలాత్రిపుర సుందరిగా..

పళ్లిపట్టు: పళ్లిపట్టు బజారు వీధిలోని శ్రీకన్యకా పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు చేశారు. సాయంత్రం కన్యకా పరమేశ్వరిని బాల త్రిపురసుందరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కలిగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.


పళ్లిపట్టు: అలంకరణలో శ్రీకన్యకా పరమేశ్వరి

ఈరోడ్‌లో రెండో విడత ఆక్రమణల తొలగింపు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్‌లోని పలు ప్రాంతాల్లో ఆక్రమణలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వాహనాల రాకపోకలకు అవస్థలు ఎదురవుతున్నాయి. 6 నెలల కిందట కొన్ని ప్రాంతాల్లో తొలగించారు. మళ్లీ ఆక్రమణలు చోటుచేసుకోవడంతో కలెక్టర్ రాజగోపాల్ సుంకర ఉత్తర్వుల ప్రకారం గతనెల 20న మొదటి విడతగా పన్నీర్‌సెల్వం పార్కు, మణిగూండం, నేతాజీ రోడ్డు, ఎల్లైమారియమ్మన్ కోవిల్ వరకు ఆక్రమణలు తొలగించారు. ప్రస్తుతం రెండో విడతగా గురువారం కరుంగల్‌పాళయం గాంధీ విగ్రహం, ఆర్‌కేవీ రోడ్డు, మణిగూండం, గాంధీ రోడ్డు, కాళైమాట్టు విగ్రహం వరకు తొలగించారు. కొన్నిచోట్ల అధికారులు, దుకాణ యజమానుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. శుక్రవారం కూడా తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఆలయ భవనం స్వాధీనం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఆలయానికి సొంతమైన ఆక్రమణల్లో ఉన్న భవనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. చెన్నై తిరువళ్లికేణి పార్థసారథి ఆలయానికి డాక్టర్ నటేశన్ రోడ్డులో 3,424 చదరపు అడుగుల విస్తీర్ణంలో దుకాణాల భవనం, అద్దె గృహాల్లో ఉంటున్న వారు అద్దె సక్రమంగా చెల్లించలేదు. వారు భవనాన్ని ఆక్రమించుకునేందుకు యత్నించారు. మద్రాసు హైకోర్టు ఆదేశాల మేరకు ఆలయ డిప్యూటీ కమిషనర్ సి.నిత్యా, సహాయ కమిషనర్ కె.భారతీ రాజా తదితరులు పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణల్లో ఉన్న ఈ భవనాన్ని గురువారం స్వాధీనం చేసుకొని ఆలయ నిర్వాహకులకు అప్పగించారు. ప్రస్తుతం ఆ భవనం విలువ రూ.6 కోట్లుగా అంచనా వేశామని దేవాదాయ అధికారులు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

టీఎన్ఏయూ భవనానికి రూ.10.98 కోట్లతో మరమ్మతులు

చేపట్టనున్న ప్రజాపనుల శాఖ

– న్యూస్‌టుడే, వడపళని



రాష్ట్రంలోని కోయంబత్తూరు కేంద్రంగా ఉన్న తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయా (టీఎన్ఏయూ)నికి ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడి 115 ఏళ్ల పురాతన కట్టడానికి భారీ మరమ్మతులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

సైదాపేటలో..

వర్సిటీ ప్రారంభానికి ముందు చెన్నై(అప్పటి మద్రాసు) సైదాపేటలో 1868లో 'అగ్రికల్చరల్ స్కూల్'గా ప్రారంభమైంది. ఆ తర్వాత కోయంబత్తూరుకు మారి 1920లో మద్రాసు వర్సిటీతో అనుసంధానమైంది. వ్యవసాయ విద్య, పరిశోధనలు, ఉత్పత్తులతో చక్కటి సేవలందిస్తోంది. ఇక్కడి భవనంలోని ప్రవేశద్వారాలు, కిటికీలు వంటివి పాడై దర్శనమిస్తున్నాయి.

1906లో నిర్మాణం

చెన్నైలోని రాష్ట్ర ప్రజాపనుల శాఖ ఆధ్వర్యంలోని 'హెరిటేజ్' విభాగం రూ.10.98 కోట్లతో మరమ్మతులకు సిద్ధమైంది. 1906లో టీఎన్ఏయూ భవన నిర్మాణం ప్రారంభమవగా 1909 జులైలో ప్రారంభించారు. లండన్ నుంచి దిగుమతి చేసుకున్న ఇనుము, స్థానికంగా తయారైన ఎర్ర ఇటుకలు, రాళ్లతో నిర్మించారు. కోయంబత్తూరు సమీపంలోని కొండల క్వారీల నుంచి గ్రానైట్ రాళ్లు తెప్పించారు. ఇటుకలు, సున్నం, బెల్లం కలిపి పైకప్పు నిర్మించారు. తలుపులు, కిటికీలకు నాణ్యమైన టేకు కలప ఉపయోగించారు.

రెండు విడతలుగా..

మరమ్మతులు రెండు విడతలుగా జరుగుతాయని టీఎన్ఏయూ అధికారి అన్నారు. మొదటి విడత పనులకు రూ.4.2 కోట్లు, రెండో విడత కింద రూ.6.77 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. పాడైన కిటికీలు, తలుపులను మొఘల్ పద్ధతిలో మరమ్మతులు చేయనున్నట్టు ప్రజా పనులశాఖ అధికారి తెలిపారు. వచ్చే ఏడాది చివరికల్లా పూర్తయ్యే అవకాశాలున్నట్లు మరో అధికారి పేర్కొన్నారు.

ఆవిన్ కేంద్రంలో మంత్రి తనిఖీ

సైదాపేట, న్యూస్‌టుడే: చెన్నై అంబత్తూరులోని ఆవిన్ పాల కేంద్రంలో పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజకన్నప్పన్ గురువారం తనిఖీలు చేశారు. ఇక్కడ ప్రతిరోజూ 4.60 లక్షల లీటర్ల పాలను శీతలీకరణం చేసి అంబత్తూరు, అన్నానగర్, టీనగర్, అయనావరం, ఆవడి, ట్రిప్లికేన్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి రాజకన్నప్పన్ పాల ప్యాకెట్ల తయారీ, యంత్రాల శుభ్రత, డెయిరీ పరిశుభ్రతను పరిశీలించారు. సమర్థవంతంగా పని చేయాలని అధికారులకు సూచించారు.

పాల ప్యాకెట్ పరిశీలిస్తున్న మంత్రి రాజకన్నప్పన్ →



టీవీకే మహానాడు విజయవంతం కావాలని తీర్థయాత్ర

సైదాపేట, న్యూస్‌టుడే: సినీ నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఈనెల 27న మొదటి రాష్ట్ర మహానాడును విక్రవాండిలో నిర్వహించనుంది. ఈ క్రమంలో మహానాడు విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ తిరునెల్వేలి జిల్లాలోని పార్టీ నిర్వాహకులు రాష్ట్రంలోని పలు ఆలయాలు, మసీదులు, చర్చిలకు తీర్థయాత్ర చేపట్టారు. అన్ని మందిరాల నుంచి పవిత్ర జలాలను తీసుకుని శుక్రవారం విక్రవాండిలో జరిగే మహానాడు వేదిక నిర్మాణ భూమిపూజలో చల్లనున్నట్లు ప్రకటించారు. తిరునెల్వేలి నెల్లయప్పర్ ఆలయం, తూత్తుక్కుడి మాతా చర్చి, ఉవరి మసీదు తదితర మందిరాల్లో పవిత్ర జలాలు పొందారు.







గుడి, చర్చి, మసీదులో పవిత్ర జలాలు పొందిన టీవీకే నిర్వాహకులు

గాయకుడు మనో భార్యపై దాడి వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: గాయకుడు మనో భార్యపై దాడికి సంబంధించి ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నై వలసరవాక్కం శ్రీదేవీకుప్పం మెయిన్‌రోడ్డు, రాధా అవెన్యూ ప్రాంతంలో మనో ఇల్లు ఉంది. గతనెల ఆయన ఇంటి వద్ద నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తులకు, మనో కుమారులకు మధ్య ఏర్పడిన గొడవల కారణంగా ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయపడిన వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనో ఇంట్లో పని చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మనో కుమారులపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో మనో భార్య జమీలా వలసరవాక్కం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందులో.. తన ఇంట్లోకి చొరబడిన వ్యక్తులు తనపై దాడిచేసి కారులో ఉన్న రూ.2.50 లక్షలు నగదు, 12 సవర్ల నగలు తీసుకెళ్లినట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు కృపాకరన్, 16 ఏళ్ల బాలుడిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి ఎస్ఎస్‌డీ టోకెన్లు లేకుండా గురువారం సాయంత్రానికి క్యూలైన్‌లలో వచ్చిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్ట్‌మెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయి టీబీసీ వరకు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. వీరికి దాదాపు 15 గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుందని తితిదే తెలిపింది. రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లు కలిగిన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లోని ఆరు కంపార్ట్‌మెంటులో వేచి ఉన్నారు. వీరికి మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. బుధవారం శ్రీవారిని 80,613 మంది భక్తులు దర్శించుకున్నారు. రూ.2.92 కోట్లు హుండీ కానుకలు లభించాయి. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది.


ఆలయం ఎదుట ఎల్.మురుగన్ కుటుంబం, చిత్రంలో తితిదే ఓఎస్డీ సత్రేనాయక్

వేంకటేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర సహాయ మంత్రి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి మూలమూర్తిని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ దర్శించుకున్నారు. ఆయనకు తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆగమోక్తంగా కలశస్థాపన మహోత్సవం

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: ముక్కంటి ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువుదీరిన కనకదుర్గ అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గురువారం కలశస్థాపన మహోత్సవం ఆగమోక్తంగా జరిగింది. యాగ కలశాన్ని అర్చకులు శిరస్సుపై ఉంచుకుని ఆలయానికి ప్రదక్షిణగా తీసుకువచ్చి ఆలయంలో ఉంచారు. అనంతరం అమ్మవారికి విశేష అభిషేకాలు చేశారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ ఆజాద్, ఈఈ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కనకదుర్గమ్మకు అభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం

రోడ్డు ప్రమాదంలో పూజారి మృతి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్ళూరు సమీప వేప్పంపట్టుకు చెందిన రాజా (62) తిరువాలంగాడులోని వడారండేశ్వరుడి ఆలయంలో అర్చకుడు. ఇతను ద్విచక్ర వాహనంపై బుధవారం రాత్రి చెన్నైకి బయలుదేరాడు. కాక్కళూరులో రోడ్డుకు అడ్డంగా ఆవు పరుగెత్తడంతో ఉన్నట్టుండి బ్రేక్ వేశాడు. వాహనం పైనుంచి కిందపడ్డ అతను తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతన్ని తిరువళ్ళూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

బైక్ పైనుంచి పడి మహిళ...

పళ్లిపట్టు: తిరుత్తణి తాలూకా తెక్కలూరు గ్రామానికి చెందిన శరవణన్, సరస్వతి (40) భార్యాభర్తలు. ఆర్‌కేపేట యూనియన్ తగరకుప్పం గ్రామంలో శరవణన్ పినతండ్రి మృతి చెందాడు. దీంతో శరవణన్ దంపతులు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో శోళింగర్-వాలాజాపేట రోడ్డులో వస్తుండగా ఉన్నట్టుండి వాహనానికి అడ్డంగా శునకం వచ్చింది. సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక కూర్చున్న సరస్వతి కిందపడగా తలకు తీవ్ర గాయమైంది. వెంటనే ఆమెను వేలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. ఆర్‌కేపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి దారుణహత్య

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై పెరియనాయక్కన్‌పాళ్యంలోని పార్కు వద్ద ఓ వ్యక్తి మృతదేహం పడిఉండడాన్ని ఆ ప్రాంతవాసులు గురువారం ఉదయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. మృతుడు చిత్తాపుదూరుకు చెందిన కన్నన్ (30)గా తేలింది. అతని ఒంటిపై గాయాలు ఉండటంతో హత్యగా నిర్ధారించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో కూలీ బలవన్మరణం

పెరియపాళ్యం: పెరియపాళ్యం సమీప మేట్టుపాళ్యానికి చెందిన గోపి (52) రైతు కూలీ. ఇతనికి భార్య మహేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో మహేశ్వరి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన గోపి క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబీకులు అతన్ని పెరియపాళ్యంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించగా మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యం

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా శోళింగర్ సమీప పాండియనల్లూర్ గ్రామంలోని చెరువు కట్టకు వెళ్లే దారిలో విశ్వనాథన్ అనే రైతుకు చెందిన చెరకు తోట ఉంది. తోటలో 70 ఏళ్ల వయసున్న వృద్ధురాలి మృతదేహం పడి ఉన్నట్లు శోళింగర్ పోలీసులకు ఫిర్యాదు అందింది. గురువారం పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించారు. మృతురాలి వివరాలు తెలియలే. దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై అత్యాచారయత్నం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి మేట్టుపాళ్యం ప్రాంతంలో ఓ అగంతకుడు బుధవారం అర్ధరాత్రి ఓ మహిళ ఇంటికి వెళ్లి తలుపు తట్టాడు. ఆమె తలుపు తెరిచి బయటకు రాగా దుండగుడు వెంటనే మహిళ నోరు మూసి లోపలికి లాక్కెళ్లి అత్యాచారానికి యత్నించాడు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు పరుగున వచ్చారు. దీంతో దుండగుడు పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మేట్టుపాళ్యం పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలిస్తున్నారు.

హత్య కేసులో యువకుడి అరెస్టు

వేలూర్, న్యూస్‌టుడే: తిరుపత్తూరు జిల్లా వాణియంబాడి సమీప రాజపాళ్యానికి చెందిన చంద్రభాయి (75) రైతు కూలీ. ఈమెను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం హత్య చేసి పారిపోయారు. ఆలంగాయం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు. అదే ప్రాంతానికి చెందిన కాళియప్పన్ అనే యువకుడిని గురువారం అరెస్టు చేశారు. చంద్రభాయి తనను తరచూ దొంగ అని పిలవడాన్ని జీర్ణించుకోలేక ఆమెను హత్య చేసినట్లు నిందితుడు తెలిపాడు.


కాళియప్పన్

క్రైం కార్నర్



అరెస్టయిన యువకులు

మద్యం మత్తులో పోలీసులను బెదిరించిన ముగ్గురు...

కోయంబత్తూరు: కోవై గాంధీపురంలో పోలీసులు బుధవారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో అటుగా వేగంగా వెళ్లిన కారును సుమారు కిలోమీటరు దూరం వెంబడించి పట్టుకున్నారు. కారులో ఉన్న వ్యక్తి.. తాను ఎంపీ కనిమొళి మేనేజరు తమ్ముడినని, అందరినీ దూర ప్రాంతాలకు బదిలీ చేయిస్తానని లేదా సస్పెండు చేయిస్తానని బెదిరించాడు. అతనితో పాటు కారులో ఉన్న ముగ్గురు మద్యం మత్తులో ఉన్నట్లు పోలీసులు గుర్తించి అరెస్టు చేశారు. వారు కాట్టూరుకు చెందిన కిరణ్, బాలాజీ, శివానందంగా తేలింది.

● అరెస్టయిన తర్వాత ఈ ముగ్గురు సామాజిక మాధ్యమంలో ఓ వీడియో విడుదల చేశారు. ఎంపీ కనిమొళి పేరు చెబితే పోలీసులు వదిలేస్తారని భావించి అలా చెప్పామని, తమను క్షమించాలని కోరారు.

దాడి కేసులో ఆరుగురు...

పొన్నేరి: మీంజూరు సమీప తోట్టక్కాడుకు చెందిన రఘు, ఇతని భార్య జయభారతి, కోడలు అర్చనపై మూడు రోజుల క్రితం కొందరు దుండగులు కత్తులతో దాడి చేసి పారిపోయారు. క్షతగాత్రులు పొన్నేరి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మీంజూరు పోలీసులు దర్యాప్తు చేపట్టి చిన్నకావణానికి చెందిన వసంత్, తిరుపతి, మారనరాజ్, మణికంఠన్, అమీర్, రమ్యను గురువారం అరెస్టు చేశారు. రమ్య భర్త లక్ష్మణన్ కొద్ది రోజుల క్రితం హత్యకు గురయ్యాడు. ఇందుకు ప్రతీకారంగా దాడి జరిపినట్లు దర్యాప్తులో తేలింది.

పరారీలో ఉన్న నిందితుడు...

సైదాపేట: కోయంబత్తూరు జిల్లాకు చెందిన ముత్తుసామి (30)పై గత ఏడాది కోయంబత్తూరు నగర పోలీసుస్టేషన్‌లో వరకట్న వేధింపుల కేసు నమోదైంది. అప్పటినుంచి పరారీలో ఉన్న అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. విదేశాలకు పారిపోయే అవకాశం ఉందని సమాచారం రావటంతో పోలీసులు అన్ని అంతర్జాతీయ విమానాశ్రయాలకు లుక్అవుట్ నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం చెన్నై విమానాశ్రయం నుంచి దుబాయ్ వెళ్లే విమాన ప్రయాణికుల వద్ద అధికారులు దర్యాప్తు చేస్తుండగా ముత్తుసామి దొరికాడు. వారి సమాచారం మేరకు కోయంబత్తూరు పోలీసులు విమానాశ్రయానికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేసి తీసుకెళ్లారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ...

పళ్లిపట్టు: పళ్లిపట్టు తాలూకా పొదట్టూరుపేట కక్కన్‌నగర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు ఎస్సై నేతృత్వంలో సిబ్బంది గురువారం ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. మయిల్ (40) అనే మహిళ ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి 20 సీసాలను స్వాధీనం చేసుకున్నారు. మయిల్‌ను అరెస్టు చేసి పళ్లిపట్టు కోర్టులో హాజరుపరిచి తిరుత్తణి జైలుకు తరలించారు.

100 సవర్ల నగల చోరీ

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దిండుక్కల్ నగరంలో పళని బైపాస్ పక్కన ఉన్న పంచాయతీ యూనియన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సవురిముత్తు పనిచేస్తున్నారు. ఈయన భార్య స్టెల్లా ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయిని. వీరికి ఏకైక కుమార్తె ఉంది. ఆమెకు వివాహం నిశ్చయించారు. కొత్త వస్త్రాలు కొనుగోలు చేసేందుకు కుటుంబం బుధవారం తిరుచ్చికి వెళ్లి రాత్రి ఇంటికి చేరుకున్నారు. తాళాలు పగులగొట్టి ఉండటంతో లోనికెళ్లి చూడగా బీరువాలో ఉన్న 100 సవర్ల బంగారు నగలు, రూ.20 వేల నగదు కనిపించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విమానాశ్రయంలో విదేశీ సిగరెట్లు స్వాధీనం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుచ్చి విమానాశ్రయంలో విదేశీ సిగరెట్లు, సువాసన వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. షార్జా నుంచి ఎయిర్ ఏషియా ఎక్స్‌ప్రెస్ విమానం గురువారం వచ్చింది. అందులో ఓ ప్రయాణికుడు 9,140 సిగరెట్లు అక్రమంగా తెచ్చినట్లు గుర్తించారు. వాటి విలువ రూ.1.55లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. అతని వద్ద పాకిస్థాన్‌లో తయారు చేసే సువాసన వస్తువులు కూడా ఉన్నట్లు గుర్తించారు. వాటి విలువ రూ.47వేలు ఉంటుందని, స్వాధీనం చేసుకున్నామన్నారు.


స్వాధీనం చేసుకున్న సిగరెట్ ప్యాకెట్లు

ఆటోడ్రైవరు ఆత్మహత్యా బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: చెన్నై పల్లవన్‌సాలై ఇంధిరాగాంధీ నగర్‌కి చెందిన ప్రకాష్ ఆటో డ్రైవరు. ఇతను బుధవారం సెంట్రల్ రైల్వే స్టేషన్ ముందున్న నో-పార్కింగ్ ప్రాంతంలో ఆటోని ఆపి గోడపైకి ఎక్కాడు. గమనించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది అతన్ని కిందికి దించి ఆటోని స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేశారు. గురువారం ఉదయం కోర్టులో హాజరై జరిమానా చెల్లించాలని పోలీసులు అతన్ని హెచ్చరించి పంపించేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్న ఆర్‌పీఎఫ్ కార్యాలయానికి వచ్చిన ప్రకాష్.. తనపై నమోదుచేసిన కేసుని కొట్టేయాలని కోరాడు. పోలీసులు నిరాకరించడంతో కార్యాలయం వెనుకవైపు ఉన్న సుమారు 40 అడుగుల ఎత్తున్న రైల్వే సిగ్నల్ టవర్‌పైకెక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని అతనికి నచ్చజెప్పి కిందికి దించారు.